వాళ్లనలా వదిలేద్దాం

శ్రీ నేమాని సంగమేశ్వరరావు

(గతసంచిక తరువాయి)

"ఎలావున్నాడే?"

"అదేమో! నాకు నచ్చేరు! అయినా నీకు చెపితే అతిశయంలాగుంటింది కాని నా అదృష్టమనుకో!"

"ఆహా! అలాగా! అంత అందగాడా! అయితే అట్టే పొగడకు! నీకు కాబోయే భర్తగారికి దృష్టిదోషం తగులుతుంది,"

"ఆ! చాలించు నీ వేళకోళాలు! చూస్తావుగా పెళ్ళిలో! అన్నట్టు ఇంకా చాలమంది ఇళ్లకి వెళ్లాలి. పెరసనలుగా వెళ్ళి పిలవకపోతే తప్పించుకుంటారని నేనే స్వయంగా బయలుదేరేను! నువ్వురాకపోతే నా మీద ఒట్టే! నన్ను చంపుకో తిన్నట్టే!.. "అంటూ లేచింది రవణమ్మ.

"ఎందుకే అంతంత ఒట్లు! నేను తప్పకుండా వస్తాగా! ఉండు ... ఒక సిప్పు కాఫీతాగి పోదువుగాని–" అంటూ వంటలక్కకు కేక పెట్టింది దమయంతి.

"అయినా నువ్వింత వేగిరం పెళ్ళిచేసుకోవడం నా కిష్టంలేదే! చూడు మన జానకి – అప్పుడే ఒక ఆడపిల్లకూడాను –" అంది దమయంతి కొంచం విరక్తిభావంతో.

"మనందేనికీ కారకులం కామనుకో! ఎలా జరుగవలసింది అలాగే జరుగుతుంది. చిన్నప్పటి భావాలు వుద్దేశాలు పెద్దయ్యాక వాతావరణాన్ని బట్టి మార్చుకోవాలి–" అంది వేదాంతధోరణిలో రవణమ్మ.

రవణమ్మ మాటలకు ఒకసారి పేలవంగా నవ్వింది దమయంతి.

వంటలక్క కాఫీ తెచ్చి టేబిలు మీద పెట్టి పోయింది. ఇద్దరూ త్రాగేరు.

"వస్తా! రావడం మానికూడదు సుమా! ఒకరోజుముందుగా వస్తే సంతోషం. మనస్నేహితురాండ్రు అందరూ అలాగే వస్తారు" అంటూ లేచింది రవణమ్మ.

"అలాగే లేవే!"

రవణమ్మ వెళ్లిపోయింది.

"ఎవరే?" అంటూ ప్రవేశించింది తల్లి.

"మా స్నేహితురాలు రవణమ్మకు 24–వ తారీకులన పెళ్ళట – పిలవడానికి స్వయంగా వచ్చింది" అంది దమయంతి.

"చూసేవా! అప్పుడేనీతోటివాళ్లందరికి

పెళ్లిళ్లు అయి, మొగళ్లతో కాపురాలు చేస్తూ పిల్లలనుకూడా కంటున్నారు. నువ్వు ఒక్కతెవు మాత్రమే పెళ్లివద్దని ఒకటే గోల! వచ్చే మాఘంలో నీ పెళ్లి చేసెయ్యాలి......'' ఇలా అంటున్న తల్లి మాటలు పట్టించుకోకుండానే మౌనంగా మేడమెట్లు ఎక్కి తన గదిలోకి వెళ్లింది దమయంతి.

2

రవణమ్మ పెళ్లికి తను మొదట వెళ్లడానికి యిష్టపడలేదు దమయంతి! ఆ కోలాహలం ఆ గడబిడలు ... అవన్నీ తనకు సరిపోవు.

ప్రశాంత వాతావరణము, ఏకాంత విహారము కోరే దమయంతి అలా అనుకోవడము సహజమే!

అయితే వెళ్లకూడదనుకునే వెళ్లింది! రవణమ్మ వివాహసమయంలో ఏదయినా ప్రెజంటు చెయ్యాలన్న వూహేరాలేదు దమయంతికి! సినిమా చూసి రావడానికి బయలుదేరినట్టు బయలుదేరింది!

పెళ్లివాళ్ల యిల్లు ఆనందనిలయములా ఆనందముతో కళకళలాడుతూ ప్రకాశిస్తున్నది. వంటబ్రాహ్మణుల కేకలు, పేరంటాళ్ల సందడులు, పిల్లల అల్లరలు, పసివాళ్ల ఏడుపులు, ఒకమూల పేకాటలో లీనమయిన ప్రముఖుల వాదనలు, బాజావాళ్ల గోల......ఇలా వున్న ఆయింటిని చూసి ఒక్కమారు వుక్కిరి బిక్కిరి అయింది దమయంతి!

తనకంటె ముందే, సరోజ, శాంతి, సుగుణ వచ్చినట్టువుంది! పెళ్లి కూతురికి అలంకరిస్తున్నారు, హాస్యాలాడుతూ! జానకికూడా కుమార్తెనెత్తుకొని అక్కడే కూర్చుని పెళ్లికూతురు రవణమ్మతో ఏమిటో అమితానందముతో మాట్లాడుతున్నది.

ఆ ఆనందములో లీనమయినవాళ్లు తన రాకనే గమనించినట్టు లేదు.

కట్నకారులు తనవంక చూసే వెర్రి చూపులు తప్పించుకొని పెళ్లికూతురు సాన్నిధ్యం చేరడమే ఒకగగనమయింది దమయంతికి.

చుట్టూముట్టి కౌగిలించుకున్నంత పని చేసేరు స్నేహితురాండ్రు. సరోజ పరుగెత్తి కాఫీ, వుప్మా తీసుకొచ్చి దమయంతికి యిచ్చింది. ఉత్తికాఫీ మాత్రమే తీసుకొని కొంచముస్థిమిత పడ్డాది దమయంతి.

''ఏమే! ఒకరోజు ముందుగా రమ్మంటే ముహూర్తము పది నిముషాలు వుండనగా వచ్చేవ్?'' అంది రవణమ్మ.

మౌనముగా వూరుకొంది దమయంతి.

''దమయంతి సంగతి నీకు తెలుసుండికూడా ఎందుకే అలాఅడుగుతావు-తనకంటే నీకుముందుగా పెళ్లయిపోతున్నదని నీమీద

కోపమొచ్చిందే! అందుకే విధిలేక వచ్చినట్టు వచ్చింది! అసలు రావడమే మానేసేదేమో!'' అంది జానకి కొంచం వ్యంగ్యంగా దమయంతిని చూస్తూ.

ఈ మాట దమయంతిని నిశ్చయంగా నొప్పించింది. జ్ఞానములేకుండా నోటికి ఏది వస్తే అది మాట్లాడము దమయంతి మనస్తత్వానికే విరుద్ధం.

అయినా జానకికి ఎప్పుడూ ఒకరిని నొప్పించినట్టు మాట్లాడడం అలవాటు.

దీనికికూడా దమయంతి దగ్గరనుండి జాబాబు రాకపోవడంవల్ల మిత్రురాండ్ర బృందంలో ఒకవిధమయిన ఆశాభంగం కలిగి ఆ సన్నివేశాన్ని ఒక్క అరక్షణం దిగులుపరిచింది.

పురోహితుని కేకలు .... రవణమ్మ తల్లి రావడం ... రవణమ్మను తీసుకొని వెళ్లడం జరుగడంవల్ల అందరితోపాటు తను కూడా వారిని అనుసరించింది దమయంతి.

మంగళసూత్రధారణ, మొదలుగాగల తంతు అంతా నిర్విఘ్నంగా జరిగింది.

రవణమ్మ భర్తనుచూసింది.. ఏమంత అందగాడుకాదు... పెద్దముక్కు ... నాటకాలవాళ్లలాగ పెద్దక్రాపింగు...ఏమయితేనేం? రవణమ్మకి నచ్చేడు... ఈమాత్రం దానికే రవణమ్మ అంతగా తన భర్త గురించి పొగిడింది. ఒకమారు నవ్వుకుంది. దమయంతి.

రవణమ్మ .. ఆమె భర్త ఇంతమందిచుట్టున్నారనే సంకోచము, జ్ఞానములేకుండా ఒకరి పక్క ఒకరు చూసుకోవడం నవ్వుకోవడం ... దమయంతికి ఆనందము కలిగించడానికి బదులు మనస్సులో చిన్న జుగుప్సను కలిగించేయి.

తనలో ఏదో ''బలహీనత'' వున్నట్టు ఫీలయింది దమయంతి. తను పెళ్లిపీటల మీద కూర్చున్నట్టు భ్రాంతిపడ్డది. అయితే అక్కడ తన ప్రక్క రవణమ్మ భర్త వున్నట్టు కనిపించింది. వ్యాకులతతో ఆ తలంపులన్నీ మనస్సులోంచి నెట్టేసింది!

ఎందుకో ఒకమారు అక్కడ కూర్చున్న మొగవారివైపు తన దృష్టి కేంద్రీకరించి చూసింది. వారిలో చాలమంది కళ్లు వివాహ తతంగం పక్క లేకుండా ఆడవాళ్లమీదకే వుండడంచూసి దమయంతి అసహ్యించుకొంది.

ఎందుకో కొన్ని నిమిషాలపాటు ఆమెకు చెముడు, గుడ్డి వచ్చినట్టు ఫీలయి అక్కడ జరుగుతున్న తంతు ఏమీపట్టలేదు!

''వధువు మిత్రురాలు సుశీల, వధూవరులకు వివాహ సందర్భములో ఈ టాయిలెట్ కేసు బహూకరించినారు'' అని గట్టిగా అరచిన పురోహితుడి అరుపు

తనను మళ్ళా ఈ ప్రపంచములోనికి తెచ్చింది.

అప్పుడుకాని స్ఫురణకురాలేదు దమయంతికి తను ప్రజంటుచేయడానికి ఏమీ తీసుకొనిరాలేదని.

ఆలోచించుకుంది తనలో! వెంటనే తన మెడలో నెక్లెస్ తీసి పురోహితుడి చేతిలోపెట్టి "ఒక మిత్రురాలు ప్రేమతో వధువుకు..." అని మాత్రం చెప్పండి చాలు అంది.

సుమారు రెండు వందలు రూపాయిలు ఖరీదుచేసే నెక్లెస్ ప్రజంటు చెయ్యడం అచ్చటవున్నయావన్మందిని దిగ్భ్రాంతుల్నిగచేసింది. ఎంతబలవంతంచేసినా వుండకుండా, అందరి దగ్గరా శెలవుతీసుకొని ఇంటికి బయలుదేరింది దమయంతి.

పొంగి పొంగి ప్రవహిస్తున్న నదీజలంలా జనసమూహం రోడ్డుమీద పారుతున్నాది. గొలుసులాగ కారులు, సైకిలు రిక్షాలు పోతున్నాయ్. చాల రిక్షాలలో వయస్సులోవున్న యువతీ యువకులు బుజాలు రాసుకుంటూ ఏమిటేమిటో కబుర్లుచెప్పుకుంటూ సాగిపోతున్న రిక్షాలను, కార్లనుగాని, ప్రవహిస్తున్న జనసమూహాన్నిగాని లక్ష్యంచెయ్యకుండా మొదటి ఆట సినీమాకు కాబోలు వెళుతున్నారు వెఱ్ఱి ఆనందములో!

ఎదురుగావున్న సైకిలురిక్షావాడు దమయంతి ఆలోచిస్తూ కుంటి నడకలు నడవడంచూసి "అమ్మా! రిక్షాకావాలా?" అంటూ రిక్షా లాక్కుంటూ దగ్గరకి వచ్చేడు.

మాట్లాడకుండా రిక్షాఎక్కి కూర్చుంది! ఇంటిగుర్తుచెప్పి పొమ్మన్నది.

వడిగాపోతున్న సైకిలురిక్షాలోంచి లోకం పోకడ చూస్తున్న దమయంతికి, ఈ లోక విచిత్రాలు, తాపత్రయాలు, మాయానాటకాలు చూస్తున్నకొద్దీ లోకంమీద, లోకంలోవుండే వ్యక్తులమీద అసహ్యత కలగనారంభించింది.

సాగుతున్న రిక్షా హటాత్తుగా ఆగడం గమనించింది దమయంతి! రిక్షావాడు దిగి ఛైయిను తప్పిందిలాగుంది దానిని సరిచేసి మళ్ళా తొక్కడం మొదలు పెట్టేడు.

రిక్షావాడిచేతిలో డబ్బులుపడేసి ఇంటి గుమ్మంఎక్కి ఇంట్లోకి నడిచింది దమయంతి!

హాలులో అన్నయ్య, మరెవరో ఒక కొత్త యువకుడు కూర్చొని ఏమిటో మాట్లాడుకుంటున్నారు.

టేబిలుమీద రేడియో తన పనిని చేసుకుపోతున్నాది. మద్రాసు న్యూసు వీళ్లు వింటున్నారో లేక వాళ్ల మాటలలో లీనమయ్యారో దమయంతి తెలుసుకోలేక పోయింది.

మాట్లాడకుండా నడిచి మేడమెట్లుఎక్కి తన గదిలోకి వెళ్ళింది దమయంతి. గది చీకటిగావుంది. స్విచ్ వేసింది !

సీతను పిలిచి కాఫీ తెమ్మంది. చీర మార్చుకుందామనుకుంది. మళ్ళా ఎందుకో అలాగే స్తబ్దుగా మంచంమీద వాలిపోయింది !

సీత కాఫీ తెచ్చి బల్లమీద పెట్టి అక్కడే నిలబడింది – ఖాళీఅయితే కప్పు తీసికెళ్ళేందుకు!

“వెళ్లు! ఇక్కడెందుకు నిలబడ్డావ్” అంది చిరాకుగా సీతతో. సీత మాట్లాడకుండా మేడదిగి వెళ్లిపోయింది.

కాఫీ ఒక్క గుక్క తాగి అక్కడే మిగిలినకాఫీ వదిలివేసి ఆలోచిస్తూమంచంమీద పడుకుంది.

ఆత్రుతగా మెట్లెక్కి అన్నయ్య వచ్చాడు. “ఏం చెల్లాయ్! అలాపడుకున్నావ్ ?” లేచికూర్చుంది.

“ఉత్తినే అన్నయ్యా! ఏం ఇలా వచ్చేవ్ ?”

“చూడు! నువ్వు వచ్చేసరికి నేను ఒకతనితో హాలులో మాట్లాడుతున్నానా ?”

“అవును”

“అతనెవరో నీకు తెలుసా ?

“అతనెవరో నాకెలా తెలుస్తుందన్నయ్యా!”

“అతను నాస్నేహితుడు – ప్రభాకరరావు. ఇవాళే ఈ వూరు వచ్చేడు మద్రాసు నుండి. ఇంటికయినా వెళ్లకుండా సరాసరి ఇక్కడకే వచ్చేడు...”

“అయితే ?”

“ఆ! ఏం లేదు ... వాడితో చెప్పేను నువ్వు అద్భుతంగా పాడతావని!”

“అలాగా!”

(సశేషము)

అన్ని నొప్పులకు

అమృతాంజనము